సాక్షి కామారెడ్డి

గురువారం । 26 । సెప్టెంబర్ । 2024



యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

రోజూ యోగా చేస్తే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

- 8లో ▸



సేవ చేయడం అదృష్టం

రైతులకు సేవ చేసే అవకాశం రావడాన్ని అదృష్టంగా భావించాలని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పేర్కొన్నారు.

- 9లో ▸

గరిష్ఠం/కనిష్ఠం

37.5 /23.2

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరునుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

'సస్య రక్షణ చర్యలు చేపట్టాలి'



కామారెడ్డి రూరల్: పంటల సాగులో రైతులు అప్రమత్తంగా ఉండాలని, సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్ సూచించారు. బుధవారం చిన్నమల్లారెడ్డి శివారులోని వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఇటీవల కురిసిన వర్షాలకు తెగుళ్లు సోకే ప్రమాదం ఉందన్నారు. ఎక్కువగా కాండం తొలిచే పురుగు ఆశిస్తోందన్నారు. దాని నివారణకు మందులను సూచించారు. ఆయన వెంట రైతులు దొడ్లె బాలయ్య, చంద్రారెడ్డి, రెడ్డి స్వామి, కుమ్మరి నర్సయ్య, రాజగౌడ్, రాజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఏఈవో శ్రీనివాస్ రెడ్డి తదితరులున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి టౌన్: జిల్లాలోని వైద్య విధాన పరిషత్ పరిధిలోగల ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేయనున్నారు. ఆసక్తిగల వారు ఒకటో తేదీ మధ్యాహ్నం ఒంటిగంటలోగా తన కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని డీసీహెచ్‌ఎస్ విజయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఒక గైనకాలజిస్ట్, రెండు పిడియాట్రిషన్, ఒక ఆర్థోపెడిస్ట్, రెండు జనరల్ మెడిసిన్, నాలుగు జనరల్ జీడీఎంవో పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. బాన్సువాడ ఏరియా ఆస్పత్రిలో రెండు గైనకాలజిస్ట్, ఒక జనరల్ సర్జన్, మూడు పీడియాట్రీషన్, రెండు జనరల్ జీడీఎంవో పోస్టులు, ఎల్లారెడ్డి సీహెచ్‌సీలో రెండు గైనకాలజిస్ట్, ఒక అనస్థీషియాలజిస్ట్, ఒక జనరల్ సర్జన్, దోమకొండ సీహెచ్‌సీలో ఒక్కో గైనకాలజిస్ట్, అనస్థీషియాలజిస్ట్, జనరల్ సర్జన్ పోస్టులు, మద్నూర్ సీహెచ్‌సీలో ఒక్కో అనస్థీషియాలజిస్ట్, జనరల్ సర్జన్, జనరల్ జీడీఎంవో పోస్టు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఇతర వివరాలకు డీసీహెచ్‌ఎస్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

యోగా ఇన్‌స్ట్రక్టర్ల నియామకాలకు పరీక్ష



నిజామాబాద్ నాగారం : ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో హెల్త్ సెంటర్‌ల పరిధిలో ఉన్న యోగా సెంటర్లలో ఇన్‌స్ట్రక్టర్ల నియామకాల కోసం బుధవారం పరీక్షలు నిర్వహించారు. ఆయుష్‌శాఖ అడిషనల్ డైరెక్టర్ లింగరాజు, ఆర్‌డీడీ ప్రమీలదేవి ఆధ్వర్యంలో జీజీహెచ్‌లో నియామక ప్రక్రియ నిర్వహించారు. యోగా డాక్టర్ల సమక్షంలో ప్రక్రియకు వచ్చిన వారితో యోగాసనాలు వేయించారు. ఉమ్మడి జిల్లాలో 32 సెంటర్లు ఉండగా ఒక్కో యోగా కేంద్రంలో మగ, మహిళ చొప్పున ఇద్దరిని ఎంపిక చేయనున్నారు. ఈ ఎంపికలకు సుమారు 500మంది హాజరు అయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ జిల్లా ఇన్‌చార్జి నారాయణరావు, కామారెడ్డి జిల్లా ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు, యోగా వైద్యులు తిరుపతి, దేవయ్య, డీపీవోలు వందన, శ్రీకాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

నిఘా నీడలో కామారెడ్డి

- పోలీసులపై రాళ్ల దాడిని తీవ్రంగా పరిగణిస్తున్న ఉన్నతాధికారులు
- పరిస్థితి అదుపు తప్పకుండా జాగ్రత్తలు
- పట్టణంలో భారీగా బలగాల మోహరింపు
- వివిధ సంఘాలతో సమావేశాలు

జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో చిన్నారితో పీఈటీ అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటనతో తలెత్తిన ఉద్రిక్త పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు శ్రమిస్తున్నారు. పట్టణంలో నిఘా పెంచారు. పలు ప్రాంతాలలో భారీగా బలగాలను మోహరించారు. వివిధ సంఘాలతో సమావేశాలు నిర్వహించి, సంయమనం పాటించాలని సూచించారు.



పట్టణంలో బందోబస్తుకు చుట్టుపక్కల జిల్లాలనుంచి తరలివచ్చిన పోలీసులు

కామారెడ్డి క్రైం : జిల్లాకేంద్రంలోని జీవదాన్ పాఠశాలలో ఆరేళ్ల బాలికతో ఓ వ్యాయామ ఉపాధ్యాయుడు అసభ్యకరంగా ప్రవర్తించాడని ఆరోపిస్తూ బాలిక కుటుంబ సభ్యులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు నిందితుడిపై పోక్సో కేసు పెట్టి, అరెస్టు చేశారు. ఈ సంఘటన వెలుగులోకి రావడంతో నిందితుడితో పాటు, పాఠశాల యాజమాన్యం, విద్యాశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాల నాయకులు, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ సహా పలువురు నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవారం పాఠశాల వద్ద ఆందోళన చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆందోళనకారులు రాళ్ల దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో పట్టణ సీఐ, ఎస్సై సహా పలువురు పోలీసులకు తీవ్ర గాయాలయ్యాయి. తలకు బలమైన గాయం అయిన పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు లాఠీచార్జి చేసి ఆందోళనకారులను చెదరగొట్టారు. అయితే ఆందోళనకారులు బుధవారం మళ్లీ పెద్ద ఎత్తున నిరసనలకు దిగవచ్చన్న అనుమానంతో పోలీస్‌శాఖ అప్రమత్తమైంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాతో పాటు చుట్టు పక్కల జిల్లాలకు చెందిన డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, వందల సంఖ్యలో సిబ్బందిని రప్పించి, పట్టణంలోని ప్రధాన కూడళ్లు, రహదారులు, పాఠశాలలు, ముఖ్యమైన ప్రాంతాల్లో బందోబస్తు ఏర్పాటు చేశారు. పట్టణం పూర్తిగా పోలీసు నిఘాలో ఉంది. ఎక్కడ చూసినా పోలీసుల పహారా కనిపించింది.

కేసులు నమోదు..

పాఠశాలలో చిన్నారితో అసభ్యకరంగా ప్రవర్తించిన పీఈటీ నాగరాజుపై పోలీసులు సోమవారమే పోక్సో కేసు నమోదు చేసి, అరెస్ట్ చేశారు. అయినా కొందరు ఉద్దేశపూర్వకంగా గొడవ సృష్టించి పరిస్థితి అదుపు తప్పేలా చేశారని పోలీసులు భావిస్తున్నారు. ఆందోళన చేస్తున్న వారిలో కొందరు పోలీసులపై రాళ్లతో దాడులకు తెగబడిన విషయాన్ని పోలీసు శాఖ ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. దాడులకు తెగబడిన వారిని గుర్తించే పనిలో ఉన్నారు. దాడులకు పాల్పడినవారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్పీ సింధు శర్మ స్పష్టం చేశారు. పాఠశాలతోపాటు పోలీసులపై దాడులకు సంబంధించి ఇప్పటికే రెండు కేసులు నమోదు చేశారు. ఆయా కేసుల్లో దాడులకు పాల్పడింది ఎవరనేది తెలుసుకునే పనిలో ఉన్నారు. వీడియోలు, సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. అనుమానం ఉన్న ప్రతి ఒక్కరినీ ఎక్కడికక్కడ కట్టడి చేస్తున్నారు. అలాగే జిల్లా కేంద్రంలో మరోసారి ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా పరిస్థితిని చక్కదిద్దేందుకు ఎస్పీ సింధు శర్మ ఆధ్వర్యంలో జిల్లా పోలీసు శాఖ అన్ని రకాల జాగ్రత్త చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా బుధవారం కామారెడ్డి డీఎస్పీ కార్యాలయానికి అన్ని మతాలు, విద్యార్థి సంఘాల ప్రతినిధులను పిలిపించి వేరువేరుగా సమావేశాలు ఏర్పాటు చేశారు. జరిగిన ఘటనకు సంబంధించి చట్టపరంగా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని, ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని పోలీసులు సూచించారు. ప్రజాస్వామ్య బద్ధంగా, సామరస్యంగా ముందుకు వెళ్లాలని, దాడులకు దిగడం సరికాదని పేర్కొన్నారు. ఏదైనా సమస్య ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని ఆయా సంఘాల ప్రతినిధులకు సూచించారు.



పెద్ద బజార్‌లో పోలీసుల బందోబస్తు

దాడులకు పాల్పడితే ఉపేక్షించబోం

- వదంతులను సృష్టిస్తే చర్యలు తప్పవు
- ఎస్పీ సింధు శర్మ



మీడియాతో మాట్లాడుతున్న ఎస్పీ సింధు శర్మ

కామారెడ్డి క్రైం: దాడులు, అల్లర్లకు కారణమయ్యే వారిని ఉపేక్షించేది లేదని ఎస్పీ సింధు శర్మ హెచ్చరించారు. పోలీసులపై దాడులకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. బుధవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని జీవదాన్ పాఠశాలలో బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన పీఈటీ నాగరాజుపై ఆమె తల్లిదండ్రులు ఈనెల 23 న ఫిర్యాదు చేశారని, అదేరోజు పోక్సో కేసు పెట్టి నిందితుడిని అరెస్ట్ చేశామని పేర్కొన్నారు. నిందితుడికి కఠిన శిక్ష పడేలా చూస్తామన్నారు. అతడిపై హిస్టరీ షీట్ కూడా తెరుస్తామన్నారు. జీవదాన్ పాఠశాల వద్ద మంగళవారం పోలీసులపై జరిగిన రాళ్ల దాడి ఘటనలో పలువురు పోలీసులకు తీవ్ర గాయాలయ్యాయన్నారు. దాడి చేసిన వారిని ఉపేక్షించబోమన్నారు. పాఠశాల ఆస్తుల ధ్వంసం, పోలీసులపై దాడి ఘటనలకు సంబంధించి రెండు కేసులు నమోదు చేశామని తెలిపారు. ఆయా కేసుల్లో దాడులకు పాల్పడింది ఎవరనేది సీసీ ఫుటేజీలు, వీడియోల ఆధారంగా గుర్తిస్తామన్నారు. బాధితురాలి ఆరోగ్యం బాగుందని, శారీరకంగా ఎలాంటి గాయాలు కాలేదని పేర్కొన్నారు. చిన్నారి ఆరోగ్యం విషయంలో సోషల్ మీడియాలో వస్తున్న వదంతులను నమ్మవద్దని ప్రజలను కోరారు. ప్రజలను రెచ్చగొట్టే విధంగా వదంతులను సృష్టించడం, సోషల్ మీడియాలో పోస్ట్‌లు పెట్టడం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఏఎస్పీ నర్సింహారెడ్డి, ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

3న ఎల్లారెడ్డి బల్దియా

చైర్మన్ ఎన్నిక



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ ఎన్నిక కోసం ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. వచ్చేనెల 3న ఎన్నిక ప్రక్రియ నిర్వహించనున్నట్లు మున్సిపల్ కార్యాలయం సిబ్బంది తెలిపారు. ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణపై ఏప్రిల్ 27న కౌన్సిలర్లు అవిశ్వాస నోటీసు ఇచ్చారు. మే 18న అవిశ్వాస పరీక్ష నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే అప్పటి చైర్మన్ అవిశ్వాస పరీక్షపై హైకోర్టును ఆశ్రయించారు. దీంతో కోర్టు అవిశ్వాస పరీక్ష నిర్వహించి ఫలితాన్ని వెల్లడించరాదని ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఆదేశాల మేరకు ఆర్డీవో అవిశ్వాస పరీక్ష నిర్వహించి, ఫలితాన్ని వెల్లడించలేదు. అనంతరం అవిశ్వాస పరీక్ష ఫలితాన్ని వెల్లడించాలని కౌన్సిలర్లు హైకోర్టుకు వెళ్లారు. ఫలితాన్ని వెల్లడించాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. అవిశ్వాసం నెగ్గిందని ఆర్డీవో ప్రకటించడంతో మున్సిపల్ చైర్మన్ పోస్టు ఖాళీ అయ్యింది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 3వ తేదీన ఎన్నిక నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 10వ వార్డు కౌన్సిలర్ పద్మ శ్రీకాంత్ చైర్‌పర్సన్ అయ్యే అవకాశాలున్నాయని తెలుస్తోంది.

నిజాంసాగర్‌లోకి 14 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

నిజాంసాగర్: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో బుధవారం సాయంత్రం నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 14 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోందని ప్రాజెక్టు డీఈ శివప్రసాద్ తెలిపారు. దీంతో ప్రాజెక్టు రెండు గేట్ల ద్వారా 14 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నామన్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 1,405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా బుధవారం సాయంత్రానికి 1,404.96 అడుగుల (17.744 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు.

మింగేసిన డబ్బుల రికవరీ ఎప్పుడు?

- మాక్లూర్ సొసైటీ మహాజన సభలో చైర్మన్‌ను నిలదీసిన రైతులు
- మాజీ చైర్‌పర్సన్ గోపు లక్ష్మి హాజరు కాకపోవడంపై ఆగ్రహం

మాక్లూర్: పదవిని అడ్డు పెట్టుకొని సొసైటీని దివాలా తీసిన మాజీ చైర్‌పర్సన్ గోపు లక్ష్మి లేకుండా మహాజన సభ ఎలా నిర్వహిస్తారని రైతులు చైర్మన్ బూరోల్ల అశోక్‌ను నిలదీశారు. బుధవారం మాక్లూర్ వ్యవసాయ పరపతి సంఘంలో చైర్మన్ అధ్యక్షతన మహాజన సభ జరిగింది. సభ ప్రారంభంతోటే సీఈవో ప్రవీణ్ లావాదేవీలను చదివి విన్పిస్తుండగా అక్రమాలకు పాల్పడిన గోపు లక్ష్మి విషయం చర్చకు తెచ్చారు. అవినీతి ఆరోపణలతో పదవి నుంచి తొలగిపోయినా లక్ష్మి డైరెక్టర్‌గా హాజరు కావాల్సి ఉండగా ఇప్పటికి రెండు పర్యాయాలు మహాజన సభ జరిగినా హాజరు కాకపోవటంలో ఆంతర్యమేమిటని రైతులు ప్రశ్నించారు. చైర్‌పర్సన్ లక్ష్మి హయాంలో భారీ ఎత్తున అవినీతి జరిగితే సభలో ప్రస్తావన లేకుండా చేయడంపై వారు మండిపడ్డారు. ఆమె ఎరువులను ఇతర మండలాల్లో విక్రయించుకోవటమే కాకుండా రూ.కోటికి పైగా అవినీతి చేసిందని ఆ డబ్బులను ఎప్పుడు రికవరి చేస్తారో చెప్పాలన్నారు. నెల రోజుల్లో రికవరి చేయటానికి ప్రయత్నిస్తున్నామని సీఈవో వెల్లడించారు. కొందరు డైరెక్టర్లు సొంతగా తీసుకున్న డబ్బులను ఎప్పుడు చెల్లిస్తారని ప్రశ్నించారు. సదరు డైరెక్టర్లు డిసెంబర్ నాటికి చెల్లిస్తామని హామీ ఇచ్చారు. నెల తర్వాత మహాజన సభ ఏర్పాటు చేసి సొసైటీలో సభ్యత్వం ఉన్న ప్రతి రైతును ఆహ్వానించి నిర్ణయాలు తీసుకోవాలని రైతులు కోరారు. మాజీ చైర్మన్ కొట్టాల లింగారవు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రావు, వైస్ చైర్మన్ గుండారం శేఖర్, డైరెక్టర్లు కాశీనాథ్‌రావు, అంజునాయక్, జిట్టా చిన్నా గంగాధర్, రవి ప్రకాష్ పాల్గొన్నారు.



మహాజన సభలో సొసైటీ చైర్మన్‌ను నిలదీస్తున్న రైతులు

గ్రామాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలి

- నిరంతరం పారిశుధ్య పనులు కొనసాగించాలి
- అధికారులతో సమీక్షలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, పక్కన అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అధికారులు

కామారెడ్డి క్రైం: గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలను సిద్ధం చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఎంపీడీవోలు, ఎంపీవోలతో గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక, గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితా ప్రచురణ, పారిశుధ్యం, ఇంటి పన్నుల వసూళ్లు, లేఅవుట్‌లు, భవన నిర్మాణాల అనుమతులు, ఉపాధి హామీ, ప్రజా పాలన, మహిళా శక్తి, అమ్మ ఆదర్శ పాఠశాల తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితాలను నిర్ణీత సమయంలో ప్రచురించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాలలో పారిశుధ్య పనులు నిరంతరం చేపట్టాలని సూచించారు. ఇంకుడు గుంతలు, ఫాంపాండ్స్ నిర్మించుకునేలా ప్రజలను ప్రోత్సహించాలన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. జాబ్‌కార్డులు కలిగిన ఉపాధి కూలీలకు వంద రోజుల పనిదినాలు కల్పించాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకంలో వ్యవసాయ అనుబంధ పనులు చేసుకోవచ్చని తెలిపారు. గ్రామాలలో ఆస్తి పన్ను, సీసీ చార్జీల వసూళ్ల లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. మహిళా శక్తి పథకాన్ని ఎంపీడీవోలు పర్యవేక్షించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీ సీఈవో చందర్, డీఆర్‌డీవో సురేందర్, డీపీవో శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఓటర్ల నమోదుకు సహకరించాలి

జిల్లాలో 18 ఏళ్లు నిండిన వారిని కొత్త ఓటర్లుగా నమోదు చేసే ప్రక్రియకు సహకరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. కలెక్టరేట్‌లో బుధవారం పార్టీల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వచ్చేనెల 29 న ముసాయిదా ఓటరు జాబితాను ప్రచురిస్తామన్నారు. దాంట్లో ఏవైనా అభ్యంతరాలు, ఆక్షేపణలు ఉన్నట్లయితే నవంబర్ 9, 10 తేదీలలో ఏర్పాటు చేసే ప్రత్యేక సదస్సులో ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. జనవరి 6న తుది ఓటరు జాబితాను ప్రచురిస్తామన్నారు. కామారెడ్డి నియోజకవర్గం పరిధిలో 97.52 శాతం, జుక్కల్‌లో 98.02 శాతం, ఎల్లారెడ్డిలో 99.24 శాతం ఇంటింటి సర్వే పూర్తయ్యిందని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సరళ తదితరులు పాల్గొన్నారు.

దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు ఘన నివాళి

కామారెడ్డి టౌన్: ఏకాత్మతా మానవతావాదాన్ని ప్రవచించి, దేశాభివృద్ధికోసం తపించిన పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో పండిట్ దీనదయాళ్ ఉ పాధ్యాయ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలోని ప్రతి వ్యక్తికి అభివృద్ధి ఫలాలు అందాలని ఆయన ఆకాంక్షించారన్నారు. ఆయన చూపిన మార్గంలో నడవాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు విపుల్, పట్టణ అధ్యక్షుడు ఆకుల భరత్, అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మా రెడ్డి, మున్సిపాలిటీలో పార్టీ ఫ్లోర్ లీడర్ శ్రీకాంత్, నాయకులు రవీందర్, రజనీకాంత్, సంతోష్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కేవీఆర్, నాయకులు

'మండలి'కి సమాయత్తం!

- ముగియనున్న పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీల పదవీకాలం
- ఈనెల 30 నుంచి ఓటరు నమోదు ప్రక్రియ మరూ
- సన్నద్ధమవుతున్న ఆశావహులు

శాసన మండలి ఎన్నికల సందడి మొదలయ్యింది. నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాలకు సంబంధించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంతో పాటు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఓటరు నమోదు షెడ్యూల్ విడుదలయ్యింది. ఈనెల 30నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఆశావహులు సైతం ఎన్నికలకు సన్నద్ధమవుతున్నారు.

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాలకు సంబంధించిన పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీల పదవీకాలం వచ్చే ఏడాది మార్చి 29తో ముగియనుంది. ఆయా స్థానాలకు 2019లో ఎన్నికలు జరిగాయి. పట్టభద్రుల ఎమ్మెల్సీగా టి.జీవన్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా కూర రఘోత్తంరెడ్డి గెలుపొందారు. వారి పదవీకాలం మార్చి 29తో ముగియనుండడంతో ఎన్నికలు నిర్వహించడానికి ఎన్నికల అధికారులు సన్నద్ధమయ్యారు. ఓటర్ల నమోదుకు సంబంధించి ఇప్పటికే షెడ్యూల్ విడుదలైంది. ఈనెల 30న ఓటరు నమోదుకు నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. అదే రోజు నుంచి నవంబర్ 6 వరకు ఓటర్లనుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. నవంబర్‌లోనే ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటిస్తారు. డిసెంబర్ 9 వరకు ఫిర్యాదులు, అభ్యంతరాలకు అవకాశం ఉంటుంది. 25 వరకు అభ్యంతరాలను పరిష్కరించి 30న తుది ఓటరు జాబితా ప్రకటిస్తారు. ఆన్‌లైన్‌లో ఓటరు నమోదుకు అవకాశం ఉందని ఎన్నికల అధికారులు తెలిపారు. గతంలో ఓటరుగా నమోదైన వారు కూడా తిరిగి నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. కాగా ఎన్నికల బరిలో నిలవడానికి ఆసక్తి చూపుతున్నవారు ఓటరు నమోదుపై దృష్టి సారించారు. జిల్లాల వారీగా పట్టభద్రులు, ఉపాధ్యాయులను ఓటర్లుగా చేర్పించేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. ఈనెల 30 న ఓటరు నమోదు ప్రక్రియ మొదలుకాగానే తమ బృందాలతో నమోదు చేయించడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

టీచర్ ఎమ్మెల్సీ కోసం..

ఉపాధ్యాయ మండలి సభ్యుడిగా పోటీ చేయడానికి వివిధ ఉపాధ్యాయ సంఘాలు సమాయత్తం అవుతున్నాయి. ఏళ్ల తరబడిగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియను పూర్తి చేసిన నేపథ్యంలో ఇటీవల రాష్ట్ర రాజధానిలో నిర్వహించిన సభలో సీఎం రేవంత్‌రెడ్డి ఉపాధ్యాయులు తమ ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ టీచర్ ఎమ్మెల్సీగా ఎవరికి మద్దతు ఇస్తుందన్న దానిపై ఆసక్తి ఉంది. ఉపాధ్యాయ సంఘాల జేఏసీ నుంచి ఎన్నికల బరిలో నిలవడానికి పలువురు ఆసక్తితో ఉన్నారు.



పట్టభద్రుల స్థానంపై పలువురి ఆసక్తి

ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి పోటీ చేయడానికి చాలా మంది ఆసక్తి చూపుతున్నారు. ఎన్నికల బరిలో నిలవాలని ఆసక్తితో ఉన్న ఆయా జిల్లాలకు చెందిన విద్యాసంస్థల అధిపతులు, వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులు ప్రయత్నాలూ మొదలుపెట్టారు. అయితే రాజకీయ పార్టీల మద్దతుతో బరిలో దిగడానికి పలువురు ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. అధికార కాంగ్రెస్ పార్టీతోపాటు బీజేపీ, బీఆర్‌ఎస్‌ల మద్దతుతో బరిలో దిగేందుకు పలువురు ఆసక్తి చూపుతున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తిరిగి బరిలో నిలవవచ్చని భావిస్తున్నారు. అయితే ఆ పార్టీ నుంచి పలువురు విద్యాసంస్థల యజమానులు పోటీ చేయడానికి ఆసక్తి చూపుతున్నట్టు తెలుస్తోంది. సంగారెడ్డికి చెందిన మాజీ ఎమ్మెల్సీ ఆర్.సత్యనారాయణ కూడా పోటీ చేయడానికి సిద్ధం అవుతున్నారు. పట్టభద్రుల నియోజకవర్గం పరిధిలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి మంచి సీట్లు రావడంతో ఆ పార్టీ నుంచి పోటీ చేయడానికి చాలామంది ముందుకు వస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో అధికారం కోల్పోయినా బలమైన క్యాడర్ ఉండడంతో బీఆర్‌ఎస్ మద్దతుతో పోటీ చేయడానికి పలువురు ఆసక్తితో ఉన్నట్లు తెలుస్తోంది. ఓటర్ల నమోదు ప్రక్రియ పూర్తయ్యాక ఆశావహుల విషయంలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

క్లుప్తంగా

నేడు సౌత్ క్యాంపస్‌లో సైన్స్ దినోత్సవం

భిక్కనూరు: తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో గురువారం సైన్స్‌దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌గౌడ్ తెలిపారు. బుధవారం ఈ విషయమై సౌత్‌క్యాంపస్‌లో బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జంతుశాస్త్ర విభాగం హెచ్‌వోడీ ప్రసన్న శీల, అధ్యాపకులు యాలాద్రి, సునీల్‌కుమార్, విజయ్‌కుమార్, శ్రీకాంత్‌లు పాల్గొన్నారు.

నేడు ఎల్లారెడ్డికి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రాక

ఎల్లారెడ్డి: నేడు ఎల్లారెడ్డికి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు రానున్నట్లు కాంగ్రెస్ నాయకులు బుధవారం తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించే కల్యాణలక్ష్మీ, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరై చెక్కులను అందించనున్నట్లు వారు తెలిపారు.

లింగంపేట మండలం కొర్పోల్‌కు..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని కొర్పోల్ గ్రామానికి గురువారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు వస్తున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ తెలిపారు. గ్రామంలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

సజ్జన్‌పల్లిలో క్రీడలు

లింగంపేట(ఎల్లారెడ్డి): సజ్జన్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం నుంచి మండల స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు కన్వీనర్ రాజాగౌడ్ తెలిపారు. అండర్–14, అండర్–17 కబడ్డీ బాలుర, బాలికలకు పోటీలు నిర్వహిస్తామన్నారు. మండలంలోని ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్థులను పోటీలకు తీసుకరావాలని ఆయన కోరారు.

పంటల పరిశీలన

మద్నూర్(జుక్కల్): మద్నూర్, డోంగ్లీ మండలాల్లోని పలు గ్రామాల్లో గురువారం వ్యవసాయ శాస్త్రవేత్తల పర్యటన ఉన్నట్లు మండల వ్యవసాయ అధికారి రాజు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురువారం ఉదయం 10 గంటలకు కేవీకే(రుద్రూర్) నుంచి వ్యవసాయ శాస్త్రవేత్తలు వస్తున్నారని వెల్లడించారు.

30న అఖిల పక్షం ఆధ్వర్యంలో ధర్నా

గాంధారి(ఎల్లారెడ్డి): ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ పంట రుణాలు మాఫీ చేయాలనే డిమాండ్‌తో ఈ నెల 30న మండల కేంద్రంలో అఖిల పక్షం ఆధ్వర్యంలో ధర్నా చేయనున్నట్లు అఖిల పక్షం నాయకులు బుధవారం తెలిపారు.

పర్మిషన్లు లేకుండానే ప్రారంభానికి..

- వస్త్ర షోరూమ్‌కు తాజాగా అగ్నిమాపకశాఖ నోటీసు
- అభ్యంతరాలు లేవనెత్తిన బల్దియా, ఫైర్ అధికారులు
- ప్రారంభోత్సవ కార్యక్రమానికి పోలీసుశాఖ గ్రీన్ సిగ్నల్?


నోటీసు అందజేస్తున్న ఫైర్ అధికారులు



ఖలీల్‌వాడి: పర్మిషన్లు లేకుండానే జిల్లా కేంద్రంలో వస్త్ర షోరూం ప్రారంభానికి సిద్ధమైంది. భారీ భవన నిర్మాణం అక్రమమని ఇప్పటికే మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తేల్చి నోటీసులు అందజేయగా, అగ్ని మాపకశాఖ అధికారులు బుధవారం నోటీసు అందజేశారు. ఇదిలా ఉండగా, గురువారం షోరూం ప్రారంభోత్సం కోసం నిర్వాహకులు పోలీసు శాఖ అనుమతి కోరడం కొసమెరుపు. వారి దరఖాస్తును పరిశీలించిన ఏసీపీ.. పరిశీలించాల్సిందిగా ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబుకు పంపించారు. అయితే, ఎస్‌హెచ్‌వో మాత్రం భవన ప్రారంభోత్సవానికి అనుమతి ఇచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. అగ్నిమాపక శాఖ నిబంధనలు పాటించని షో రూమ్‌కు జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి గౌతమ్ ఆదేశాల మేరకు బుధవారం సంబంధిత అధికారులు నోటీసు జారీ చేశారు. అధికారులు భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఫైర్ అధికారి నర్సింగ్‌రావు మాట్లాడుతూ.. అగ్నిమాపక శాఖ నిబంధనలు పాటించని వస్త్ర షోరూమ్ కి నోటీసులు జారీ చేశామన్నారు. షోరూంకి కనీసం సెట్ బ్యాక్ లేదని, అలాగే కొన్ని నిబంధనలను పాటించ లేదన్నారు. నోటీసు ఇచ్చిన 30 రోజుల్లో అగ్నిమాపక శాఖ అనుమతితోపాటు పూర్తి నిబంధనలు పాటించని పక్షంలో రెండో నోటీసు జారీ చేస్తామని తెలిపారు.

సినీ నటి రాక సందర్భంగా పోలీసుల అనుమతి కోసం..

వస్త్ర షోరూమ్ ప్రారంభించేందుకు సినీ నటిని ఆహ్వానించిన నిర్వాహకులు పోలీసుశాఖ అనుమతి కోసం ఏసీపీ రాజావెంకట్‌రెడ్డికి దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తును పరిశీలించాల్సిందిగా ఏసీపీ.. ఒకటో టౌన్ ఎస్ హెచ్ వో విజయ్‌బాబుకు పంపించారు.

ఇరుకుగా ఉన్న రాష్ట్రపతి రోడ్డులో ఇంత భవనం నిర్మిస్తారా? అని ప్రజలు పెదవి విరుస్తున్నారు. దగ్గరలోనే జీజీహెచ్, ఖలీల్‌వాడిలోని ఆస్పత్రులున్నాయని, పేషెంట్లకు ఇబ్బందులు తప్పవని అంటున్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని గతంలో ఢిల్లీవాలా స్వీట్ హోం వద్ద తనిఖీలు చేపట్టి, ట్రాఫిక్ క్లియర్ చేసిన పోలీసులు ఇప్పుడు వస్త్ర షోరూమ్‌కు అనుమతి ఇస్తారా? రాష్ట్రపతి రోడ్డులోనే ఒకరికి ఓ న్యాయం.. మరొకరికి మరో న్యాయమా అని చర్చించుకుంటున్నారు.

ఓటు నమోదుపై అవగాహన కల్పించాలి


మాట్లాడుతున్న ఆర్డీవో ప్రభాకర్


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): 18 ఏళ్లు నిండిన వారు ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని ఆర్డీవో మన్నె ప్రభాకర్ అన్నారు. బుధవారం ఆర్డీవో కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితాలో మార్పులు చేర్పులకు సంబంధించి రఖాస్తులు చేసుకునేలా చూడాలని అన్నారు. తహసీల్దార్ మహేందర్ కుమార్, నాయకులు తిరుపతి, బాలకిషన్, నర్సింలు, సురేందర్, పద్మారావు తదితరులున్నారు.

మృతుల పేర్లను తొలగించాలి

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఓటరు జాబితాలో మృతి చెందిన వారి వివరాలను తొలగించాలని తహసీల్దార్ మహేందర్‌కుమార్ అన్నారు. బుధవారం తహసీల్ కార్యాలయంలో బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి అన్ని వివరాలు సక్రమంగా ఉండేలా చూడాలని అన్నారు.

'మా భూముల్లోనే సాగు చేసుకుంటున్నాం'


తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న రైతులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): తాము ఎలాంటి శిఖం భూమిని కబ్జా చేయలేదని, తమ పట్టా భూములనే సాగుకు సిద్ధం చేస్తున్నామని మాసాన్‌పల్లికి చెందిన పలువురు రైతులు బుధవారం స్థానిక తహసీల్దార్ శ్రీనివాస్‌రావుకు వినతిపత్రం ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ.. తమ గ్రామశివారులోని శాకం చెరువు సమీపంలో 1982–83లో భూమిలేని నిరుపేద కుటుంబాలకు చెందిన 20 మంది రైతులకు 8 ఎకరాల 30 గుంటల భూమిని పంపిణీ చేసి పట్టాలను అందించారన్నారు. అప్పటి నుంచి తామంతా ఆ భూమిని కాస్తు చేసుకుంటున్నామని చెప్పారు. మా భూములకు కొత్త పాసుపుస్తకాలు కూడా వచ్చాయన్నారు. కాని తాము శిఖం భూమిని కబ్జా చేస్తున్నామని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారని, వెంటనే సరిహద్దులను గుర్తించాలని కోరారు. మాజీసర్పంచ్ అంజాగౌడ్, రైతులున్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


మొక్కలు నాటుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి

కామారెడ్డి టౌన్: ప్రతి రోజు యోగా చేస్తే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని యోగా భవన్ ఆవరణలో పలు రకాల ఔషధ, పండ్ల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరికి యోగా అవసరం అన్నారు. వీలైనంత వరకు జిల్లా కేంద్రంలో కొనసాగే యోగా క్లాస్‌కు హాజరుకావాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా యోగాసనం స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంరెడ్డి, కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ కోటేశ్వరరావు, మీడియా ప్రభారి అనిల్ రెడ్డి, ప్రతినిధులు పాల్గొన్నారు.

సమయపాలన పాటింపేదీ?


టీచర్లు లేకుండానే ప్రార్థన చేస్తున్న విద్యార్థులు

బిచ్కుంద(జుక్కల్): హజ్గుల్‌లో ఉర్దూ మీడియం ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదు. బుధవారం రెండు పాఠశాలలో ఉపాధ్యాయులు రాకకోసం విద్యార్థులు ఎదురుచూశారు. వారు రాకపోవడంతో విద్యార్థులు ప్రార్థన చేసి తరగతి గదులలోకి వెళ్లిపోయారు. సమయం 11 గంటలవుతున్నా ఒక్క ఉపాధ్యాయుడూ రాలేదు. ప్రాథమిక పాఠశాలలో ముగ్గురు, ఉన్నత పాఠశాలలో నలుగురు ఉపాధ్యాయులున్నారు. ప్రతి రోజు ఆలస్యంగా వచ్చి సాయంత్రం 3 గంటలకు వెళ్లిపోతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. ప్రార్థనలో ఒక్కరు కూడా లేకపోవడంతో గ్రామస్తులు డీఈవోకు ఫిర్యాదు చేశారు. ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి మా పాఠశాల మా ఇష్టం అంటూ ఉపాధ్యాయులు దురుసుగా మాట్లాడుతున్నారని గ్రామస్తులు అంటున్నారు.

కిసాన్ మెన్స్ వేర్ షోరూం ప్రారంభం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న బీజేపీ ఎమ్మెల్యేలు


ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలో స్టేషన్ రోడ్‌లో నూతన కిసాన్ మెన్స్ వేర్ షోరూంను బుధవారం నిజామాబాద్ అర్బన్, కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, కాటిపల్లి వెంకటరమణారెడ్డిలు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ షోరూంలో ఓ విభాగాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో యజమానులు ధన్‌పాల్ ఉదయ్‌కుమార్, ప్రణయ్ కుమార్ ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కును అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): వదల్‌పర్తి, నాగిరెడ్డిపేట, బొల్లారం, అక్కంపల్లి, గోపాల్‌పేట గ్రామాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు బుధవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మండల నాయకులు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి కిష్టయ్య, ఉపాధ్యక్షులు లక్ష్మణ్, సుధాకర్, నాయకులు పాల్గొన్నారు.

తాడ్వాయి(ఎల్లారెడ్డి): సంగోజీవాడిలో బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. గ్రామానికి చెందిన సాతెల్లి హరికృష్ణకు రూ.20 వేల చెక్కును అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, లక్ష్మణ్, మోహన్‌రెడ్డి, శివాజీ, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సదాశివనగర్(ఎల్లారెడ్డి): తిర్మన్‌పల్లిలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కును బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు బాధిత కుటుంబానికి అందజేశారు. పార్టీ మండలాధ్యక్షుడు సంగారెడ్డి, గ్రామ అధ్యక్షుడు రమేశ్ రెడ్డి, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు లింగాగౌడ్, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ బీరయ్య పాల్గొన్నారు.

లింగంపేట(ఎల్లారెడ్డి): ముస్తాపూర్ గ్రామానికి చెందిన చాకలి లక్ష్మణ్‌కు రూ.17, 500 విలువైన చెక్కును మండల పార్టీ అధ్యక్షుడు నారాగౌడ్ బుధవారం అందజేశారు. ఏఎంసీ వైస్‌చైర్మన్ జొన్నల రాజు, ఎల్లమయ్య, అశోక్, రఫీక్, భాస్కర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

వసుంధర మహాపాదయాత్ర



నిజాంసాగర్(జుక్కల్): తెలంగాణ ఉప పీఠం దోస్త్‌పల్లి నరేంద్ర మహారాజ్ ఆధ్వర్యంలో బుధవారం వసుంధర మహా పాదయాత్ర చేపట్టారు. పాదయాత్రలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు, మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌సింధే పాల్గొన్నారు.

వయోవృద్ధుల దినోత్సవం వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



కామారెడ్డి క్రైం: అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా వారం రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాల వాల్‌పోస్టర్లను కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ బుధవారం తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ బావయ్య, సీనియర్ సిటిజన్లు పాల్గొన్నారు.

క్రీడల్లో పెద్దకొడప్‌గల్ విద్యార్థినుల ప్రతిభ



పెద్దకొడప్‌గల్(జుక్కల్): జుక్కల్ నియోజకవర్గ పాఠశాల గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీలలో పెద్దకొడప్‌గల్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. అండర్–14, అండర్–17 విభాగాల్లో 23 మంది విద్యార్థినులు జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించారు. పీఈటీ జ్యోతి, విద్యార్థినులను పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సునీత అభినందించారు. ఈ నెల 28న జరగబోయే జిల్లాస్థాయి పోటీలలో వీరు పాల్గొంటారని తెలిపారు. పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ నాగరాణి, ఉపాధ్యాయులు రాములు, విట్టల్, పవన్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



మాచారెడ్డి: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి షేక్ సలాం ఆకాంక్షించారు. మాచారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన ఫ్రెషర్స్ డే పార్టీలో ఆయన మాట్లాడారు. ప్రణాళికబద్ధంగా చదివితేనే భవిష్యత్తు బాగుంటుందన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన అలరించింది. పలువురిని సన్మానించారు. కళాశాల ప్రిన్సిపాల్ యాకినుద్దీన్, అతిథులు వినోద, ప్రభాకర్, రాజమౌళి గుప్తా, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

క్రైం కార్నర్

హత్య కేసులో జీవిత ఖైదు

ఖలీల్‌వాడి: రిటైర్డ్ కానిస్టేబుల్ హత్య కేసులో మహిళకు జీవిత ఖైదు విధిస్తూ జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి సునీత కుంచాల బుధవారం తీర్పునిచ్చారు. నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఖానాపూర్ గ్రామానికి చెందిన గంగామల్లుకు.. ఆమె ఇంటికి ఎదురుగా ఉండే రిటైర్డ్ కానిస్టేబుల్ రాంప్రసాద్‌కు గత కొన్నేళ్లుగా తగాదాలున్నాయి. వాహనాల పార్కింగ్ విషయంలో ఇద్దరి మధ్య గొడవలు జరిగేవి. ఫిబ్రవరి 25న రాత్రి నిజామాబాద్ నుంచి ఖానాపూర్‌కు వస్తున్న రిటైర్డ్ కానిస్టేబుల్ రాంప్రసాద్‌ను ఖానాపూర్ శివారులో మాటువేసి వెనుక నుంచి బండ రాయితో మోది హత్య చేసింది. నిజామాబాద్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి గంగామల్లును జైలుకు తరలించారు. నిందితురాలి మీద పోలీసులు మోపిన అభియోగాలు రుజువుకావడంతో న్యాయస్థానం శిక్ష విధించింది.

బాలికపై అత్యాచారం కేసులో..

కామారెడ్డి క్రైం: బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ కామారెడ్డి కోర్టు బుధవారం తీర్పునిచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. 2023 మార్చి 8 న కామారెడ్డి మండలంలోని రామేశ్వర్‌పల్లికి చెందిన బాలకృష్ణ(40) చాక్లెట్లు ఇప్పిస్తానని ఓ చిన్నారిని ఊరి బయటకు బైక్‌పై తీసుకువెళ్ళి కల్లు తాగించి అత్యాచారం చేసి శివాలయం వద్ద వదిలి వెళ్లిపోయాడు. చిన్నారి కోసం వెతికిన కుటుంబ ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లగా స్పృహలోకి వచ్చిన తరువాత అసలు విషయం తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన దేవునిపల్లి పోలీసులు బాలకృష్ణను అరెస్ట్ చేసి రిమాండ్ చేశారు. కేసు పుర్వాపరాలను పరిశీలించిన కామారెడ్డి కోర్టు అదనపు జిల్లా జడ్జి లాల్‌సింగ్ శ్రీనివాస్‌నాయక్ నిందితుడికి జీవిత ఖైదు, రూ.10 వేలు జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు వెలువరించారు. కేసు విచారణ చేపట్టిన అప్పటి డీఎస్పీలు సురేశ్, నాగేశ్వర్‌రావు, సీఐ రామన్, ఎస్సైలు ప్రసాద్, రాజు, పీపీ శేషు, లైజనింగ్ అధికారి మురళి, కానిస్టేబుళ్లు బాలకృష్ణ, దేవిసింగ్‌ను ఎస్పీ సింధు శర్మ అభినందించారు.

దూషించిన వ్యక్తికి మూడేళ్లు..

ఖలీల్‌వాడి: అప్పు తీసుకున్న కొడుకు తిరిగి చెల్లించలేదని తల్లిని దూషించిన కేసులో ఓ యువకుడికి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ రెండో అడిషనల్ సెషన్స్ జడ్జి టి శ్రీనివాస్ బుధవారం తీర్పునిచ్చారు. రాందాస్ యువకుడి వద్ద నగరంలోని గాజుల్‌పేట్ ప్రాంతానికి చెందిన కార్తీక్ అప్పు తీసుకున్నాడు. తిరిగి చెల్లించకపోవడంతో 2023 ఆగస్టు 3న కార్తీక్ ఇంటికి వెళ్లిన రాందాస్.. అతడు ఇంట్లో లేకపోవడంతో తల్లి ఇందిరా బాయిని దూషిస్తూ తలుపులను తన్నడంతో ఆమె భయభ్రాంతులకు గురై రెండోటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి తగిన ఆధారాలు సమర్పించడంతో న్యాయస్థానం రాందాస్‌కు మూడేళ్ల జైలు శిక్ష విధించింది.

గోదావరిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

రెంజల్(బోధన్): కందకుర్తి పుష్కర క్షేత్రంలోని గోదావరి నదిలో గుర్తు తెలియని యువకుని మృతదేహం లభించినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. బుధవారం ఘాట్ పక్కన మృతదేహం ఉన్నట్లు గుర్తించిన స్థానికులు సమాచారం అందించారని, జాలర్ల సాయంతో బయటికి తీయించామన్నారు. మృతుడి వయస్సు 25 నుంచి 30 ఏళ్లు ఉంటుందని, బ్రౌన్ రంగు టీషర్టు, నీలి రంగు జీన్స్ ప్యాంటు ఉన్నట్లు తెలిపారు. టీషర్ట్‌పై శంకర్ ఇంజినీరింగ్ కంపెనీ, నిజామాబాద్ అని ఉన్నట్లు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

నవీపేట: మండలంలోని జన్నేపల్లికి చెందిన వల్లూరి సురేశ్ అనే వ్యక్తి ఇంట్లో దుండగులు మంగళవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి.. సురేశ్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి ఈనెల 10న హైదరాబాద్‌లోని బంధువుల ఇంటికి వెళ్లాడు. బుధవారం ఉదయం ఇంటి ఆవరణను శుభ్రం చేసేందుకు వచ్చిన పనిమనిషి సుబ్బులు తాళం పగులగొట్టి ఉండడాన్ని గమనించి సురేశ్‌కు సమాచారం అందించింది. ఆయన హుటాహుటిన హైదరాబాద్ నుంచి తిరిగి వచ్చాడు. నాలుగు తులాల బంగారు, 34తులాల వెండి ఆభరణాలతోపాటు రూ.30వేల నగదును దుండుగులు ఎత్తుకెళ్లారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వినయ్ తెలిపారు.

ప్రేమ విఫలమైందని ఆత్మహత్య

- 15 రోజుల క్రితం పురుగుల మందు తాగిన యువకుడు
- పరిస్థితి విషమించి మృతి
- ఇందల్వాయి మండలం సిర్నాపల్లిలో ఘటన


అజయ్ (ఫైల్)

ఇందల్వాయి: ప్రేమ విఫలమైందని మనస్తాపంతో పురుగుల మందుతాగిన యువకుడు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని సిర్నాపల్లి గ్రామానికి చెందిన హొన్నాజీపేట అజయ్(21) హోటల్ మేనేజ్‌మెంట్ పూర్తి చేసి ఉద్యోగాన్వేషణలో ఉన్నాడు. గ్రామానికి చెందిన ఓ యువతితో ప్రేమలో పడిన అజయ్.. చివరికి ప్రేమ విఫలం కావడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఈ నెల 10వ తేదీన పురుగుల మందు సేవించాడు. ఈ విషయం తల్లిదండ్రులకు తెలియనీయకుండా ఫుడ్ పాయిజన్ అయ్యిందని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందాడు. రెండు వారాలు గడుస్తున్నా ఆరోగ్యం బాగుపడకపోవడంతో కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని ఓ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఆస్పపత్రిలో అజయ్ సెల్‌ఫోన్‌ను పరీక్షించగా అందులో పురుగుల మందు తాగుతూ తీసుకున్న వీడియో కనిపించడంతో కుటుంబ సభ్యులు బోరునవిలపించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మనోజ్‌కుమార్ తెలిపారు.

ఆరోగ్యం సహకరించక..


రాము(ఫైల్)

ఇందల్వాయి: ఆరోగ్యం సహకరించకపోవడంతో మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన చాకలి రాము(27) పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మనోజ్‌కుమార్ తెలిపారు. పదేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాము కాలువిరగడంతో రాడ్డు వేశారు. దీంతో ఏ పని చేయలేక నిస్సహాయ స్థితిలో ఉన్న రాము జీవితంపై విరక్తి చెందిన ఈ నెల 20వ తేదీన తన పొలం వద్ద పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా బుధవారం ఉదయం పరిస్థితి విషమించి మృతి చెందాడు.

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని..


పల్లి అశోక్ (ఫైల్)

నిజాంసాగర్(జుక్కల్): మద్యం సేవించేందుకు భార్య డబ్బులు ఇవ్వలేదని భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని ఆరేడ్ పల్లిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన పల్లి అశోక్(35) జులాయిగా తిరుగుతూ మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం మద్యం సేవించేందుకు భార్య అనిత వద్ద రూ.150 తీసుకున్నాడు. సేవించి సాయంత్రం ఇంటికి వచ్చిన అశోక్.. మళ్లీ మద్యం కోసం డబ్బులు ఇవ్వాలని భార్యను అడిగాడు. ఆమె డబ్బులు ఇవ్వకపోవడంతో కోపంతో ఇంట్లోకి వెళ్లి తలుపులు పెట్టుకున్నాడు. గంట వరకు తలుపులు తీయకపోవడంతో అనుమానం వచ్చిన భార్య గ్రామస్తుల సహకారంతో తలుపులు తీయగా.. అశోక్ దులానికి ఉరేసుకొని చనిపోయాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పది నిమిషాల్లో రూ.4.69 లక్షలు మాయం


బాధితుడు భాస్కర్

గాంధారి(ఎల్లారెడ్డి): సైబర్ నేరగాళ్లు ఓ వ్యక్తి బ్యాంకు ఖాతా నుంచి పది నిమిషాల వ్యవధిలో రూ.4.69 లక్షలు కాజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మాతు సంగెం గ్రామానికి చెందిన కమ్మరి భాస్కర్ గ్రామంలో వడ్రంగి పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇల్లు నిర్మించుకోవాలనే ఆలోచనతో తాను సంపాదించిన కొద్దిపాటి డబ్బులను యూనియన్ బ్యాంకు ఖాతాలో జమ చేశాడు. బుధవారం ఉదయం 11 గంటల సమయంలో తన భార్య అకౌంట్‌నుంచి తన అకౌంట్‌కు ఒక్క రూపాయి ట్రాన్స్‌ఫర్ చేసుకోగా, ఆ వెంటనే పది నిమిషాల్లో భాస్కర్ అకౌంట్ నుంచి మూడు విడతల్లో రూ.4.69 లక్షలు విత్‌డ్రా అయ్యాయి. అకౌంట్‌లో కేవలం రూ.108 నిలువ ఉన్నట్లు మెస్సేజ్ రావడంతో ఖంగు తిన్న బాధితుడు వెంటనే కామారెడ్డిలోని యూనియన్ బ్యాంకుకు చేరుకుని మేనేజర్‌కు విషయం తెలిపాడు. పరిశీలించిన బ్యాంకు అధికారులు.. అకౌంట్‌ను దుండగులు హ్యాక్ చేసి రూ.4.69 లక్షలు విత్‌డ్రా చేసినట్లు గుర్తించారు. పోలీసులకు ఫిర్యాదు చేసి ఎఫ్ఐఆర్ కాపీ తీసుకురావాలని భాస్కర్‌కు సూచించడంతో గాంధారి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇంటి నిర్మాణం కోసం దాచుకున్న డబ్బులు పోయాయని బాధితుడు రోదించాడు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ఇందల్వాయి: అక్రమంగా తరలిస్తున్న 7.73 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని మండలంలోని గంగారాం తండాలో పట్టుకున్నట్లు సివిల్ సప్లయీస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఆకుల మహేశ్‌కుమార్ తెలిపారు. బియ్యాన్ని సీజ్ చేసి వాహనాన్ని పోలీస్ స్టేషన్‌లో అప్పగించామని, సెక్షన్ 6ఏ ప్రకారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బాలికను వేధించిన వ్యక్తిపై కేసు

ఖలీల్‌వాడి: బాలికను వేధించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు నగరంలోని మూడో టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్సై మహేశ్ తెలిపారు. సునీల్ అనే వ్యక్తి ప్రేమ పేరుతో బాలికను వేధించడంతో అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. బాలికలను వేధిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు.

బైక్ అదుపు తప్పి ఒకరు మృతి


రాములు మృతదేహం

బీబీపేట: బైక్ అదుపు తప్పి కింద పడిన ఘటనలో ఒకరు మృతి చెందిన ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై ప్రభాకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. బీబీపేటకు చెందిన సల్ల పెద్ద రాములు (34) బీబీపేట నుంచి జనగామ వైపు వెళ్తుండగా బైక్ అదుపుతప్పి కింద పడిపోయాడు. తల, ముఖానికి తీవ్ర గాయాలుకావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య సల్ల రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో పడి ఒకరు..

బిచ్కుంద(జుక్కల్): బహిర్భూమికి వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన మక్కె హన్మాండ్లు మూడు రోజుల క్రితం బహిర్భూమికని ఇంట్లో చెప్పి వెళ్లాడు. ఆయన తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. బుధవారం కమ్మరి చెరువు నీటిలో హన్మాండ్లు మృతదేహం తేలింది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని, హన్మాండ్లు ప్రమదవశాత్తు చెరువులో పడి మృతి చెందిఉండొచ్చని ఎస్సై పేర్కొన్నారు.